క్లుప్తంగా

యువతకు ఆదర్శంగా నిలవాలి



జబీనాబేగంను సన్మానిస్తున్న అశోక్‌కుమార్

కుల్కచర్ల: ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకొని స్వగ్రామానికి విచ్చేసిన యువతిని స్థానిక నేతలు ఘనంగా సన్మానించారు. మండలంలోని ముక్తవెంకటాపూర్‌కు చెందిన జబీనా బేగం ఇటీవల ఎస్ఐ శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆమెను సత్కరించారు. యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ



విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులు ఇంటి వద్ద చదివే విధంగా వారి తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ కుమార్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహించి ఏకరూప దుస్తులను అందించారు. కార్యక్రమంలో ఏఏపీ అధ్యక్షురాలు భారతమ్మ, నాయకులు వెంకటయ్య, అమృతయ్య, వెంకట్రాములు, చెన్నయ్య, శ్రీనయ్య, మొగులయ్య, గోపాల్, శ్రీనివాస్, రాఘవేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట: ముర్రు పాలతో వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని మండలంలోని అంరాదికలాన్ పల్లె దవాఖానా వైద్యురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కోల్కుందలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి తల్లి బిడ్డ పుట్టగానే ముర్రు పాలను పట్టించాలన్నారు. బిడ్డకు ముర్రు పాలే శ్రీరామ రక్ష అన్నారు. పోషకాహార లోపం నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న ఆహార పదార్థాలు తల్లి బిడ్డకు శ్రేష్ఠకరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గోంగమ్మ, ఆశవర్కర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణ కమిటీకి విరాళాన్ని అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: మండలంలోని ఘనపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి స్థానిక నాయకులతో రూ.50 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉంటాడన్నారు. ఈ మేరకు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో శివలింగం, రాములు, ప్రభు, బాలవర్ధన్, హన్మంతు, మల్క రాములు, క్రిష్ణయ్య, భరత్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న బీజేపీ నేతలు

దోమ: మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన వెన్నచెడ్ కమలమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ మేరకు బీజేపీ కార్యకర్తలు ఆమె మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు నరేశ్, శ్రీనివాస్, నర్సింహ, మల్లేశ్, కుమార్, రాజు, నర్సింహులు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం.. నిరుపయోగం

- ఊరికి దూరంగా ఆటస్థలం
- బండరాళ్లు, అడవిలో ఏర్పాటుతో అవస్థలు



క్రీడ ప్రాంగణంలో ఉన్న బండరాళ్లు



చిలుముల మైల్వార్‌లో అధ్వానంగా క్రీడా ప్రాంగణం

దుద్యాల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. లక్ష్యం ఉన్నతమే అయినా ఆచరణలో మాత్రం నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. ఫలితంగా ఎందుకు పనికి రాని, క్రీడలకు అనువుగా లేని స్థలాలను ప్రాంగణాలకు ఉపయోగించారు. దీంతో గ్రామంలో ఉండే యువత, చిన్నారులు ఆటలు ఆడేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా వీటిని ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. గ్రామంలో ఉండే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం ఆటలకు ఆమడ దూరంలో ఉంటున్నారు.

రెండు కి.మీ దూరం

దుద్యాల్ మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామంలో పాఠశాల ఊరిలో ఉంటే క్రీడా ప్రాంగణం రెండు కిలో మీటర్ల దూరంలోని అడవిలో ఏర్పాటు చేశారు. అది కూడా పెద్ద పెద్ద బండ రాళ్ల మధ్య. ఈ క్రీడా ప్రాంగణం చూస్తే ఆటలు ఆడటం కాదు.. అక్కడ ఒక్క క్షణం కూడా విద్యార్థులు నిలబడరు. అటవీ ప్రాంతంలో ఉన్న మామిడికుంట ఆంజనేయస్వామి దేవాలయంకు వెళ్లే మార్గమధ్యలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. చుట్టూ చెట్ల పొదలు, గుట్టల నడుమ క్రీడా ప్రాంగణం ఉండడంతో విద్యార్థులు, యువకులు అక్కడికి వెళ్లి ఆటలు ఆడేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో స్థలం నిరుపయోగంగా మారింది.

వెళ్లాలంటే భయం



క్రీడా ప్రాంగణం పాఠశాలకు దగ్గర ఉంటే అన్ని క్రీడలు నేర్చుకుని ముందుకెళ్లేవాళ్లం. గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉండడం, చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో అక్కడికి వెళ్లలంటే భయంగా ఉంది. దీంతో క్రీడలకు మాకు దూరం పెరిగింది.

– నందిని, విద్యార్థిని, 8వ తరగతి

ఆటలకు దూరంగా..



పాఠశాలకు క్రీడా ప్రాంగణం లేకపోవడంతో ఆటలకు దూరంగా ఉంటున్నాం. క్రీడా ప్రాంగణం పాఠశాలకు దగ్గరగా ఉంటే వివిధ క్రీడలను నేర్చుకొని మండల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపేవాళ్లం. జనావసాలు ఉంటే చోట క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి.

– యోగేశ్, విద్యార్థి, 8వ తరగతి

కిసాన్ బంధు సేవలు అభినందనీయం



కొడంగల్‌రూరల్: విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న కిసాన్‌బంధు సభ్యులతో రవీందర్‌గౌడ్

కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట: కిసాన్‌బంధు సేవలు అభినందనీయమని తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల బ్యాగులను అందించారు. బొంరాస్‌పేట మండలం ఎన్కెపల్లి, టేకులగడ్డ తండా, పూర్యానాయక్ తండా, దుద్యాల్, కొడంగల్ మండల కేంద్రంలోని ఇంద్రానగర్ పాఠశాలల్లోని 240మంది విద్యార్థులకు ఆయా పాఠశాలలకు కిసాన్‌బంధు సభ్యులతో కలిసి వెళ్లి బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13 ఏళ్లుగా కిసాన్‌బంధు మిత్రులు రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాల సభ్యులకు ఆర్థిక సహాయం , ఏటా దాదాపు 2 వందలకు పైగా విద్యార్థులకు బ్యాగులను అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కిసాన్‌బంధు ప్రతినిధులు సతీష్, సువర్చల, సాయి, నిత్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు హరిలాల్, రవీందర్‌గౌడ్, చంద్రశఖర్, అనిల్‌కుమార్, గోపాల్, పీఆర్‌టీయూ కొడంగల్ శాఖ మండల అధ్యక్షుడు అబ్దుల్‌హఖ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

పరిగి: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఏఏపీసీ చైర్ పర్సన్ పద్మావతి అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని నంబర్ వన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ విద్యార్థులకు ఉపాధ్యాయులుగా వ్యవహరించేందుకు అవకాశం కల్పించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, డీఈఓగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధనను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నామన్నారు. తమకు విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులు దైవంతో సమానం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి, మండల స్థాయి, ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



దౌల్తాబాద్: ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

దౌల్తాబాద్: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఆ సంఘం రాష్ట్ర సంపాదకులు జైపాల్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భీమప్ప, ప్రధానకార్యదర్శిగా పెంట్యా నాయక్, గౌరవఅధ్యక్షుడిగా పట్నం భీంరెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా రేణుకలను నియమించారు. అనంతరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపారు.

కిటకిటలాడిన మీసేవ కేంద్రం



జిరాక్స్ కోసం మహిళల పడిగాపులు

తాండూరు రూరల్: తాండూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న మీ సేవ కేంద్రంలోని జిరాక్స్ సెంటర్ కిటకిటలాడింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మహాలక్ష్మి పథకం కింద రూ.500 సబ్సిడీ గ్యాస్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు. దీంతో 33 గ్రామాల నుంచి దాదాపు 2 వేల మంది మహిళలు కార్యాలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద మహిళల సందడి నెలకొంది. కొందరు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ అకౌంట్ జిరాక్స్‌ల కోసం మీ సేవ కేంద్రానికి వెళ్లి తీసుకున్నారు. దీంతో మీసేవ కేంద్రం మహిళలతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వచ్చిన తర్వాత గ్యాస్ సబ్సిడీ ధ్రువపత్రాలు తీసుకొని మహిళలు గ్రామాలకు వెళ్లిపోయారు.

జోనల్ స్థాయి ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

బషీరాబాద్: మండల కేంద్రంలో జోనల్ ఖోఖో టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ఇందులో మహాత్మా జ్యోతిరావు పూలె యాలాల విద్యార్థులు ప్రతిభ చాటారు. తాండూరు ఖోఖో జోనల్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సాధించారని గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్ తెలిపారు. గెలుపొందిన జట్లకు షీల్డు, బహుమతులు ప్రదానం చేశారు.

గ్యాస్ కనెక్షన్ బాండ్ల పంపిణీ

కొందుర్గు: మండలంలోని రేగడిచిల్కమర్రిలో కాంగ్రెస్ నాయకుడు పురుషోత్తంరెడ్డి శనివారం మహిళలకు గ్యాస్ కనెక్షన్ బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. అధికారం చేపట్టగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీను, రాజేందర్ రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతగిరి: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం వికారాబాద్ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ధారూరులో..

ధారూరు: విద్యుత్ మరమ్మతుల కారణంగా మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వేసిన ఐరన్ విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయన్నారు. వాటిని తొలగింపు సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

తిరుమలనాథ గుట్టపైకి రోడ్డు వేయండి

కొడంగల్ రూరల్: నారాయణపేట జిల్లా గుండుమాల్ మండలం బలభద్రాయపల్లి గ్రామంలోని తిరుమలనాథస్వామి గుట్టపైకి సీసీ రోడ్డు వేయించాలని కొడంగల్ పట్టణంలోని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి గ్రామానికి చెందిన టి.కరుణాకర్‌రెడ్డి శనివారం వినతిపత్రం అందించారు. తిరుమలనాథ స్వామి ఆలయం బలభద్రాయపల్లి గ్రామంతోపాటు మీర్జాపూర్, హన్మన్‌పల్లి, నందిపాడ్ గ్రామాల ప్రజలకు ఆరాధ్య దైవం(ఇంటి దేవుడు)గా కొలుస్తారని తెలిపారు. నాలుగు గ్రామాల ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలతో ప్రతి నిత్యం రద్దీగా ఉండే తిరుమలనాథ స్వామి ఆలయానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సొసైటీ సర్వసభ్య సమావేశం

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి డైరెక్టర్లు, సంఘ సభ్యులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఓటరు జాబితాపై ఆందోళన వద్దు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో వార్డుల వారీగా రూపొందించిన ఓటరు జాబితాపై ఆందోళన చెందవద్దని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. రెండు రోజులుగా గ్రామంలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించి పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామంలో 7 వేల ఓటర్లు ఉండగా 14 వార్డులు ఉన్నాయన్నారు. వార్డుల వారీగా ఓటరు జాబితా ప్రదర్శనపై కొందరు అభ్యంతరలు తెలపడంతో 25 మంది పంచాయతీ కార్యదర్శులతో గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

మహాలక్ష్మి మంజూరు పత్రాల అందజేత



దౌల్తాబాద్: యాంకి గ్రామంలో మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం మంజూరు పత్రాలను అందజేస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు నర్సిములు అన్నారు. ఈ మేరకు మండలంలోని యాంకి, ఇండాపూర్ గ్రామాల్లో మహాలక్ష్మి పథకం పత్రాలను శనివారం అందజేశారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేయడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమానికి ఐదు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, నాయకులు బద్రి, మల్‌రెడ్డి, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన రూ.500లకే సిలిండర్ పత్రాలను మండల పరిధిలోని ఆలేడ్‌లో పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్ శనివారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో పథకం అమలు చేస్తూ ప్రజలకు మన్ననలు పొందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అనంతయ్య, శ్రీధర్, నర్సింలుగౌడ్, సత్యమ్మ, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు నివాళి



శేఖర్‌గుప్తా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

మర్పల్లి: మర్పల్లి మాజీ సర్పంచ్ సింగంశెట్టి శోభరాణి భర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగంశెట్టి శేఖర్‌గుప్తా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. శనివారం మృతుడి స్వగృహంలో దశదిన కర్మ నిర్వహించారు. దీనికి పలువురు నాయకులు హాజరై నివాళులర్పించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావు, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, వివిధ పార్టీల నాయకులు శేఖర్‌గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ



తాండూరు రూరల్: బూట్లు చూపుతున్న విద్యార్థులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు ఉచితంగా బూట్లు పంపిణీ చేశారు. తాండూరు పట్టణానికి చెందిన అమర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం బూట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వినోద్, నాయకులు సందీప్‌రెడ్డి, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టై, బెల్ట్‌ల అందజేత



దోమ: విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేస్తున్న నాయకులు

దోమ: మండల పరిధిలోని ఐనాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మెగ్యానాయక్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్ విద్యార్థులకు టై, బెల్ట్‌లను ఉచితంగా అందజేశారు. శనివారం పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించిన అనంతరం విద్యార్థులు వీటిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతు సహాయ సహకారాలను ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దస్తమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో లోపాలు

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉంది. తప్పులను సవరించడానికి ఇటీవల పోలింగ్ బూత్‌ల వారీగా సిబ్బంది పనిచేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ జాబితాలో తప్పులు మాత్రం అలాగే ఉన్నాయి. మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రదర్శించారు. మొత్తం ఓటర్లు 41,140 ఉన్నారు.

వేర్వేరు వార్డుల్లో రెండేసి ఓట్లు

పలు గ్రామాల్లోని ఓటరు జాబితాల్లో మృతి చెందిన వారి పేర్లు దర్శనమిస్తున్నాయి. ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే వార్డులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ పలువురి ఓటర్లు వేర్వేరు వార్డుల్లోనే ఉన్నాయి. కొందరికి వేర్వేరు వార్డుల్లో రెండేసి ఓట్లు నమోదయ్యాయయి. మరికొందరి తండ్రి, తల్లి పేరు తప్పుగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

తాండూరు: విధి నిర్వహణకు వెళ్లిన పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని తాండూరు పట్టణ సీఐ సంతోష్ శనివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. తాండూరు పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన అన్వర్‌పాషా పక్కనే పక్కింట్లో ఉంటున్న గోపాల్‌తో డబ్బుల విషయంలో శుక్రవారం రాత్రి గొడవ పడి దాడి చేశాడు. ఆ సమయంలో అన్వర్‌పాషా గట్టిగా అరుస్తు దాడి చేయడంతో సమీపంలో ఉంటున్న ఓ వ్యక్తి 100కు కాల్ చేశాడు. సమాచారం అందుకున్న తాండూరు పట్టణ పోలీసులు కానిస్టేబుల్ బండిన రేష్, హోంగార్డు నగేష్‌లకు సంఘటన స్థలానికి వెళ్లాలని పురమాయించారు. ఘటనా స్థలానికి వెళ్లి గోపాల్‌పై దాడి చేస్తున్న అన్వర్‌పాషాను అదుపులోకి తీసుకొనేందుకు వెళ్లారు. అయితే అన్వర్ పోలీసులను పక్కకు తోసేసి దుర్భాషలాడాడు. దీంతో పోలీసులు చాకచక్యంతో అతడిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. పోలీసుల విధులకు ఆటంకం కల్పించడంతో పాటు తమను దుర్భాషలాడారంటూ కానిస్టేబుల్ నరేష్ ఫిర్యాదు చేశాడు. దీంతో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రక్తదానంతో తల్లీబిడ్డలు క్షేమం

మానవత్వం చాటుకున్న సంపత్‌కుమార్



రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

తాండూరు: రక్తహీనతతో ప్రసవవేదన అనుభవిస్తున్న గర్భిణికి తాండూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు సంపత్‌కుమార్ రక్తదానం చేసి తల్లి బిడ్డలకు ఊపిరి పోశారు. వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం కంసన్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ భార్య లక్ష్మికి శుక్రవారం రాత్రి పురిటినొప్పులు రావడంతో తాండూరులోని మాతా శిశు ఆస్పత్రికి తీసుకొచ్చాడు. వైద్యులు పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉందని చెప్పారు. దీంతో జిల్లా ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లారు. అయితే కావాల్సిన రక్త గ్రూపు లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తెలిసిన వారి సహకారంతో డాక్టర్ సంపత్‌కుమార్‌ను సంప్రదించి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన తనది అదే గ్రూపు రక్తమని ముందుకు వచ్చారు. దీంతో బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. ఆ రక్తాన్ని గర్భిణికి ఎక్కించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడారు. అయితే ఇప్పటి వరకు డాక్టర్ సంపత్‌కుమార్ 159 సార్లు రక్తదానం చేయడంపై స్థానికులు అభినందించారు.